# సాక్షి

## కుమురం భీం

శుక్రవారం ၊ 4 ၊ ఆగస్టు ၊ 2023




### అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల వ్యాప్తిని నివారించాలని వైద్యులు సూచించారు. 9లో▸

### 8న ఎస్పీఎం ఎదుట నిరాహార దీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 8న ఎస్పీఎం ఎదుట బీజేపీ నాయకుడు హరీశ్‌బాబు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఎస్పీఎం ఎంప్లాయీస్ బాధితుల నెగోషియేషన్ కమిటీ ప్రతినిధి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పనిచేసిన పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం లేదని, ప్రస్తుతం విధుల్లో ఉన్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆరోపించారు.



గరిష్ఠం/కనిష్ఠం
32.4 /25.3

### వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు

నిర్మల్‌టౌన్/ఆసిఫాబాద్‌అర్బన్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు గురువారం అసెంబ్లీలో కలిశారు. అసెంబ్లీ వాయిదా అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, దివాకర్‌రావు, ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య, బాపూరావు సీఎం కార్యాలయానికి వెళ్లారు. పంట రుణాలు మాఫీ చేసినందుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు 30 మంది ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7 నుంచి హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్, కోశాధికారి లక్ష్మణ్, కోచ్‌లు విద్యాసాగర్, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

### 11 మంది విద్యార్థులకు 'కళ్ల కలక'

తిర్యాణి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో 11 మంది విద్యార్థులకు కళ్లకలక వ్యాధి సోకినట్లు పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేశ్ తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో గురువారం ఆర్‌బీఎస్‌కే బృందంతో కలిసి కళ్లకలక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు చికిత్స అందించారు. వ్యాధి బారిన పడిన విద్యార్థుల కోసం పాఠశాలలో ప్రత్యేకంగా ఐసోలేషన్ గది ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు షేక్‌కు సూచించారు. ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. ఆర్‌బీఎస్‌కే వైద్యుడు కొటిలయ్య, వైద్యసిబ్బంది ఉన్నారు.

### డీడీఎన్ అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న జిల్లా ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న డీడీఎన్ అర్చకులకు ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్ కోరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్‌ను గురువారం కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ డీడీఎన్ అర్చకులకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. ఉద్యోగభద్రత కల్పించి, సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా రూ.10వేల గౌరవ వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు గంగు సత్యనారాయణశర్మ, సహాయ కార్యదర్శి తిరుపతిచారి తదితరులు పాల్గొన్నారు.

### 5న గురుకుల టీచర్ల ధర్నా

ఆసిఫాబాద్‌రూరల్: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలనే డిమాండ్‌తో ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గురుకులాల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# శవ పరీక్ష..!

జూలై 3న కౌటాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు బుర్రి వసంత్(26), అనిల్(24) అక్కడికక్కడే మృతి చెందారు. సిర్పూర్(టి)లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామానికి తరలించడం బాధిత కుటుంబానికి భారంగా మారింది. అధిక సమయం పట్టడంతో అంత్యక్రియలూ ఆలస్యమయ్యాయి. ఇలా బెజ్జూర్ మండలంలో ఎవరైనా మృతి చెందితే శవపరీక్షకు 50 కిలోమీటర్ల దూరంలోని సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది.

తాజాగా సోమవారం సాయంత్రం కౌటాల మండలం నదీమాబాద్ కాలనీకి చెందిన పంబాల పర్వతాలు(51) హత్యకు గురయ్యాడు. పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి)లోని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం గది వద్ద కుటుంబ సభ్యులంతా శవ పరీక్ష కోసం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. పోస్టుమార్టం చేసి మంగళవారం ఉదయం మృతదేహాన్ని అప్పగించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



సిర్పూర్(టి)లోని పోస్టుమార్టం గది

- ఆసిఫాబాద్, సిర్పూర్‌లోనే మార్చురీలు
- 13 మండలాల ప్రజలకు దూరభారం
- పోస్టుమార్టం చేయించేందుకు తప్పని తిప్పలు
- వర్షాకాలం వాగులు ఉప్పొంగితే మరింత కష్టతరం

కౌటాల(సిర్పూర్): రోడ్డు ప్రమాదం.. ఆత్మహత్య, హత్య, అనుమానాస్పద మృతి, పిడుగు పాటు.. ఇలా ఘటనలు ఏవైనా కానీ కారణాన్ని నిర్ధారించేందుకు మృతదేహాలకు పోస్టుమార్టం తప్పనిసరి. జిల్లాలో కేవలం రెండుచోట్ల మాత్రమే శవపరీక్షకు అవకాశం ఉంది. దీంతో పలు మండలాల ప్రజలకు దూరభారంతోపాటు ఆర్థికభారం తప్పడం లేదు. మృతదేహాలను పరీక్ష కేంద్రాలకు తరలించలేని పరిస్థితులు ఉంటే సంఘటన స్థలానికే వైద్యులే తీసుకురావాలి. ఇందుకు బాధిత కుటుంబమే ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి, సిబ్బందికి కొంత మొత్తం ముట్టజెప్పుకోవాల్సి వస్తోందని ఫిర్యాదులు ఉన్నాయి.

**ఆ పత్రాలు కూడా..**

మెడికో లీగల్ కేసు(ఎంఎల్‌సీ) అయితేనే శవపరీక్ష చేస్తారు. సాధారణ మరణాలకు చేయరు. మృతదేహం మార్చురీకి రాగానే రెండు కీలక పత్రాలు ఇవ్వాలి. శవపరీక్ష చేయాలంటూ బాడీ సెంటు ఫారం(రిక్విజేషన్) సంబంధిత పోలీస్ అధికారి ఇస్తారు. దీంతోపాటు మృతికి గల కారణాలను నమోదు చేస్తూ పోస్టుమార్టం రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రెండు ఇచ్చిన తర్వాతే శవపరీక్ష చేస్తారు.

**రెండు చోట్ల మాత్రమే పరీక్షలు**

జిల్లాలోని 15 మండలాల్లో 20 పీహెచ్‌సీలు, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీలు ఉన్నాయి. ఇందులో కేవలం ఆసిఫాబాద్, సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. మిగిలిన 13 మండలాల నుంచి మృతదేహాలను శవపరీక్ష కోసం ఇక్కడికే తీసుకురావాలి. ఆత్మీయులను కోల్పోయిన దుఃఖంతో ఉన్నవారికి శవ పరీక్ష ఓ శిక్షలా మారుతోంది. కెరమెరి, తిర్యాణి, రెబ్బెన, వాంకిడి మండలాల నుంచి పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రానికి రావాలంటే సుమారు 20 నుంచి 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అలాగే సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్ మండలాల నుంచి 35 కిలోమీటర్ల దూరంలోని ఉట్నూర్‌కు వెళ్లాలి. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ప్రజలు సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలకు సిర్పూర్(టి) 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం ఉంటుంది. శవపరీక్ష కోసం దూరప్రాంతాలకు తరలించడానికి ప్రత్యేక వాహనం అద్దెకు తీసుకెళ్లడం భారమవుతోంది. పోస్టుమార్టం పూర్తయి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన సిబ్బంది చేతులు చాపుతున్నారనే విమర్శలూ ఉన్నాయి. శవపరీక్ష కోసం దూరాన్ని బట్టి రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

**తప్పని జాగారం**

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించి పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి) సీహెచ్‌సీకి రావాలి. ఆర్థిక ఇబ్బందులతో పాటు సమయం వృథా అవుతోంది. సమయానికి అందుబాటులో వైద్యులు లేకపోతే బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఉదయం నుంచి రాత్రంతా మార్చురీ వద్ద రోదిస్తూ కూర్చోవాల్సిందే. పోస్టుమార్టం కష్టాలను తొలగించాలనే ఉద్దేశంతో గతంలో కాగజ్‌నగర్, బెజ్జూర్, తిర్యాణి, వాంకిడి, జైనూర్ మండలాల పీహెచ్‌సీలు వైద్య విధాన పరిషత్తులో చేర్పించాలని జిల్లా వైద్యాశాఖ ప్రతిపాదనాలు పంపించినట్లు తెలుస్తోంది. మరికొన్ని మండలాల్లో శవపరీక్ష కేంద్రాలతోపాటు శవాల అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**త్వరలోనే జిల్లాకు అంబులెన్స్**



హత్యలు, ఆత్మహత్యలు, ప్రమాదాలు, అనుమానాస్పదస్థితిలో మృతి చెందితే మృతదేహాలకు శవ పరీక్ష నిర్వహిస్తారు. వైద్య విధాన పరిష త్తు వైద్యులే పోస్టుమార్టం నిర్వహించాలి. ఆసిఫాబాద్, సిర్పూర్(టి) రెండు ఆసుపత్రులే వారి పరిధిలోనే ఉన్నాయి. శవపరీక్షకు తరలించడానికి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మృతదేహాలను తరలించడానికి త్వరలో జిల్లాకు ప్రత్యేక అంబులెన్స్ రానుంది.

– రామకృష్ణ, డీఎంహెచ్‌వో

# వీడని సందిగ్ధం

- బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష సాయం పంపిణీలో తీవ్ర జాప్యం
- దరఖాస్తు దారులకు తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 3,585 మంది అర్హులు



తిర్యాణి(ఆసిఫాబాద్): వెనుకబడిన తరగతుల్లోని 14 కులాలకు చెందిన చేతివృత్తిదారులను ఆర్థికంగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి విడతలో అర్హులైన దరఖాస్తుదారులకు జూలై 15న చెక్కులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే జిల్లాలో ఇప్పటివరకు చెక్కుల పంపిణీపై సందిగ్ధం వీడటం లేదు. రెండో విడత ఆర్థికసాయం పంపిణీకి సమయం సమీపిస్తుండటంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం క్రిస్టియన్, మైనార్టీ వర్గాలకు ఆర్థికసాయం అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

**జాబితాపై గందరగోళం..**

చేతివృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో 5,558 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేశారు. 3,585 మందిని అర్హులుగా గుర్తించారు. జాబితాలోని దరఖాస్తుదారులకు ప్రాధాన్యత క్రమంలో ప్రతినెలా 15న చెక్కులు అందించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఇప్పటివరకు మొదటి విడతకు సంబంధించిన సాయం అందలేదు. జిల్లాలో అర్హుల ఎంపికపై మొదటి నుంచీ గందరగోళం నెలకొంది. గత నెలలో అధికారులు ప్రకటించకముందే అర్హుల జాబితా వాట్సాప్ గ్రూపుల్లో చకర్లు కొట్టిన విషయం తెలిసిందే. జాబితాలో సగానికి పైగా అనర్హులే ఉన్నారని వివిధ మండలాల్లో బీసీ సంఘాల నాయకులు ఆందోళనలు సైతం నిర్వహించారు. అధికారులు జాబితా లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టారు. బాధ్యులైన ఇద్దరు సిబ్బందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**తప్పని ఎదురుచూపులు..**

బీసీ కులవృత్తిదారులకు మొదటి విడతలో నియోజకవర్గానికి 300 మంది అర్హులను ఎంపిక చేసి ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల బడ్జెట్ కేటాయించింది. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో మాత్రం అధికారులు ఇప్పటికీ అర్హుల ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటికే ఓ జాబితా బయటికి రావడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన మొదలైంది. కొంత మంది దళారులు సైతం రూ.లక్ష సాయం అందేలా చూస్తామని భారీగా వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. అర్హుల ఎంపికపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటాయా.. లేదా.. అన్నది తేలాల్సి ఉంది. కాగా రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన వారికి సైతం రూ.లక్ష ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో దరఖాస్తుదారులు ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.


**అర్హులందరికీ ఇవ్వాలి**



ప్రభుత్వం చేతివృత్తిదారులకు అందజేస్తున్న ఆర్థిక ప్రోత్సాహం అర్హులైన వారందరికీ వెంటనే అందించాలి. మొదటి విడత అర్హుల జాబితా ఎంపికలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనర్హులకు ఆర్థికసాయం అందిస్తే ఆందోళనలు నిర్వహిస్తాం.

– రాయిల్ల నర్సయ్య, బీసీ సంఘం నాయకుడు

**ఎదురుచూస్తున్నాం**



ప్రభుత్వం ప్రతినెలా 15న చెక్కులు అందిస్తామని చెప్పినా ఇప్పటివరకు జిల్లాలో ప్రారంభించలేదు. ఆర్థిక ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తున్నాం. వీలైనంత త్వరగా సాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దుర్గిశెట్టి సతీశ్, దరఖాస్తుదారుడు, తిర్యాణి

**అర్హులకు చెక్కులు అందిస్తాం**

బీసీ వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం అర్హుల జాబితా ఎమ్మెల్యేల వద్ద నుంచి మాకు అందలేదు. దీంతో చెక్కుల పంపిణీలో కొంత ఆలస్యమవుతోంది. త్వరలోనే అర్హులైన వారికి చెక్కులు అందిస్తాం.

– సత్యనారాయణరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి

## పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని అంకుసాపూర్, బాబాపూర్, కొటగూడ గ్రామ పంచాయతీల్లో గురువారం పర్యటించారు. పారిశుధ్యం, సెగ్రిగేషన్ షెడ్లు, కంపోస్టు ఎరువుల తయారీ, వైకుంఠధామాల్లో నీటి వసతి, మరుగుదొడ్లతోపాటు పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. ప్రతిరోజూ ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలన్నారు.



కంపోస్టు ఎరువుల తయారీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆయన వెంట ఎంపీవో ప్రసాద్, సర్పంచులు లక్ష్మినారాయణ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

## వర్షాలపై అప్రమత్తత అవసరం

దహెగాం(సిర్పూర్): భారీ వర్షాల సమయంలో అప్రమత్తత అవసరమని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ వరద ఉన్న సమయంలో వాగులు, ఒర్రెలు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేశ్‌బాబు

సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, వైద్యాధికారి స్పందన తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడతకు సిద్ధం కావాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- 'మన ఊరు– మన బడి' పనులపై సమీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో చేపట్టిన మొదటి విడత మన ఊరు– మన బడి కార్యక్రమం పనులు పూర్తి చేసి, రెండో విడత పనులకు సిద్ధం కావాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత కలెక్టరేట్‌లో డీఈవో అశోక్‌తో కలిసి గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కార్యక్రమంలో ఎంపికైన 251 పాఠశాలల్లో 50 శాతం స్కూళ్లలో కూడా పనులు పూర్తికాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈజీఎస్ ద్వారా చేపడుతున్న మరుగుదొడ్లు, ప్రహరీలు, వంటగది పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పెండింగ్ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, విద్యార్థులకు వసతులు కల్పించేందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోలు భరత్, సుభాష్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, వేణు, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావుతో కలిసి తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సిర్పూర్(టి), ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల వారీగా గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని పరిశీలించాలన్నారు. తక్కువ పోలింగ్ శాతం, పార్టీల మధ్య గొడవలు జరిగిన ప్రాంతాలు, భద్రతాపరమైన ఇబ్బందులు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పూర్తిస్థాయి బందోబస్తు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు రాజేశ్వర్, సురేశ్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

**గిరి విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి**

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ గురువారం డీటీడీవో రమాదేవితో కలిసి గిరిజన ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, ఏటీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల తదితరులు పాల్గొన్నారు.

### ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెంపు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

కెరమెరి(ఆసిఫాబాద్): ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయని, ప్రతీ పంచాయతీలో సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో సామాజిక తనిఖీ బృందం మండలానికి రానుందని, రెండేళ్ల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర బృందం పర్యటన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. చెత్తాచెదారం నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో పురోగతి సాధించేందుకు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులను ఆదుకోవాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: దివ్యాంగులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వికలాంగుల బంధు' ప్రకటించాలని ఆ సంఘం జిల్లా కోఆర్డినేటర్ కేశవ్‌రావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. కేశవ్‌రావు మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులు గౌరవంగా బతకాలంటే ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రస్తుతం అమలు చేస్తున్న దళిత బంధు పథకంలో అర్హులైన దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలన్నారు. అంత్యోదయ కార్డు కింద 35 కిలోల బియ్యం, అర్హులైన వారికి మూడు చక్రాల స్కూటీలు పంపిణీ చేయాలన్నారు. సదరం క్యాంపుల్లో వైద్యులు సరైన పర్సంటేజీ ఇవ్వకపోవడంతో ఆసరా పింఛన్‌లకు దూరం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగ వైకల్యం లేకుండా పింఛన్ పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బన్నమూర్తి, సాయికుమార్, శంకర్, రవి, మల్లేశ్, శోభ, తరుణ్‌కుమార్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

## 'నోటిఫికేషన్ లేకుండా నియామకాలు'

ఆసిఫాబాద్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా బీసీ వసతి గృహాల్లో నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను 27 ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు ఇష్టారాజ్యంగా పంచిపెట్టారని ఆరోపించారు. బీసీ గురుకులంలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా వాచ్‌మెన్ తదితర పోస్టులు భర్తీ చేశారని అన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి రాజ్‌కుమార్, టీకానంద్, నిఖిల్ ఉన్నారు.





మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

## క్లుప్తంగా

### గూడ్స్ రైలు ఢీకొని గేదె మృతి

జైపూర్: మండలంలోని ఇందారం కాసీంపల్లె ఫ్లైవర్ బ్రిడ్జి కింద గురువారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి జైపూర్ ప్లాంట్‌కు బొగ్గు తరలించే గూడ్స్ రైలు ఢీకొని గేదె మృతి చెందింది. ఇందారం గ్రామంలోని రాసబత్తుల సావిత్రికి చెందిన గేదె రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యురిటీగార్డు అప్రమత్తంగా లేకపోవడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

### ఒకరి రిమాండ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన శ్యామల్ సర్దార్, ధీరజ్ సర్దార్‌లపై మంగళవారం రాత్రి దాడి చేసిన జయదేవ్ రాయ్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఈజ్‌గాం ఎస్సై రమన్ కుమార్ తెలిపారు. తండ్రీకొడుకులు శ్యామల్, ధీరజ్‌లపై టెంట్‌హౌజ్ యాజమాని జయదేవ్ ఇనుపరాడ్‌తో దాడికి పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి సిర్పూర్ (టి) కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

### ప్రమాదవశాత్తు బావిలోపడి వృద్ధుడు మృతి

బెజ్జూర్(సిర్పూర్): మండలంలోని మద్దిగూడ గ్రామానికి చెందిన గేడం రాములు(90) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. గ్రామానికి చెందిన రాములు బుధవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి తలండి బిచ్చు అనే రైతు వ్యవసాయ బావిలో పడిపోయాడు. గురువారం ఉదయం బావిలో మృతదేహం లభించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని కుమారుడు గేడం నందారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

జన్నారం: డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ గురువారం తెలిపారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన బాల్త రాజమౌళి, బాల్త సత్తన్న ఈ నెల 1న డబ్బుల విషయంలో ఒకరినొకరు కొట్టుకున్నారు. బాల్త సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాల్త రాజమౌళి, సంతోష్, జమున, మల్లవ్వ, సత్తన్నలపై రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాల్త సత్తన్న, బాల్త సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గోదావరిలోపడి వ్యక్తి మృతి

జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం సమీపంలో గల గోదావరిలో పడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఎల్కంటి గ్రామానికి చెందిన జలంపల్లి పోచయ్య, పోచమ్మ దంపతుల పెద్దకుమారుడైన తిరుపతి (29)కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిన తిరుపతి ఇందారం సమీపంలోని బ్రిడ్జి పైనుంచి గోదావరిలో పడిపోయాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### సమస్యల పరిష్కారంలో ఉత్సాహంగా పనిచేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నాయకులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గురువారం గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో పలు డిపార్టుమెంట్ల పిట్ కమిటీలను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికైన నాయకులు నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు పోరాడాలన్నారు. అనంతరం ఏరియా వర్క్‌షాప్ పిట్ కార్యదర్శిగా కొడెం అశోక్, మాదారం, గోలేటి సివిల్ డిపార్టుమెంట్ పిట్ కార్యదర్శిగా రఘునాథరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, చంద్రశేఖర్, కిరణ్, ఆనంద్, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సాగు జోరు


గుడిపేటలో అరక కొడుతున్న రైతు


ర్యాలీ శివారులో నాటు వేస్తున్న కూలీలు

జిల్లాలో ఖరీఫ్ సాగు పనులు జోరందుకున్నాయి. నారుమడులు సిద్ధం కావడంతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లోని పంటపొలాల్లో ఎక్కడ చూసినా రైతులు, కూలీల సందడి కనిపిస్తోంది. నాట్లు వేస్తూ, కలుపు తీస్తూ, అరక కొడుతూ వివిధ పనుల్లో నిమగ్నమైన దృశ్యాలే కనిపిస్తున్నాయి.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

# బల్దియాల్లో దోమల రొద

జిల్లాలోని మున్సిపాలిటీల్లో దోమల నియంత్రణ చర్యలు మొక్కుబడిగా సాగుతున్నాయి. చాలా మట్టుకు ఫాగింగ్‌తోనే సరిపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాల వ్యాప్తికి దోమలు దోహదం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ దోమలను సమూలంగా నివారించడంలో మున్సిపల్ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా అదే ధోరణి ప్రదర్శిస్తున్నారని పురజనులు పేర్కొంటున్నారు.

- మొక్కుబడిగా నియంత్రణ చర్యలు
- ఆందోళనలో పురప్రజలు


పాత జీఎం కార్యాలయం వద్ద క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న మురుగునీటి గుంత

జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు

| మున్సిపాలిటీ | వార్డులు | ఫాగింగ్ యంత్రాలు |
|---|---|---|
| మంచిర్యాల | 36 | 02 |
| బెల్లంపల్లి | 34 | 03 |
| చెన్నూర్ | 18 | 02 |
| లక్సెట్టిపేట | 15 | 02 (01 రిపేరులో ఉంది) |
| క్యాతన్‌పల్లి | 22 | 02 |
| నస్పూర్ | 25 | 02 |
| మందమర్రి | 24 | 01 |

బెల్లంపల్లి: వర్షాల రాకతో దోమలు విజృంభించాయి. పుర ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మురుగునీటి కాలువలు, జనావాసాలకు చేరువలో ఏర్పడిన గుంతలు దోమలకు నివాసాలుగా మారాయి. జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, క్యాతన్‌పల్లి, లక్సెట్టిపేట, మందమర్రి, నస్పూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ వర్షాల రాకతో దోమల రొద ప్రారంభమైంది. చీకటి పడగానే ఇళ్లలోకి చొరబడి పుర ప్రజలను నిద్రలేమికి గురిచేస్తున్నాయి.

**డ్రెయినేజీలు, నీటిగుంతల్లో ఆవాసాలు**

మున్సిపాలిటీల్లోని డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు సరిగా చేపట్టడంలేదు. దీంతో కాలువల్లో మురుగునీరు స్థిరంగా నిలిచి ఉంటోంది. వీటికి తోడుగా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పరిసరాలు చిత్తడిగా మారడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. మురుగునీటి గుంతల్లో లార్వను వదిలేయడంతో దోమల సంతతి దినదినాభివృద్ధి చెందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ దోమల రొద ప్రధాన సమస్యగా మారింది.

**భారీ వర్షాలు, వరదలతో...**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. అన్నిప్రాంతాల్లోనూ అంచనాలకు మించి వర్షం కురిసి లోతట్టుప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. జిల్లా కేంద్రమైన మంచిర్యాల మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, నస్పూర్, లక్సెట్టిపేట్ మున్సిపాలిటీల్లో వరద ప్రభావం ప్రస్ఫుటంగా కనిపించింది. బెల్లంపల్లి, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల్లోనూ పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**ఫాగింగ్‌తోనే సరి..**

ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే దోమల నివారణకు మున్సిపల్ యంత్రాంగం ఈసారి కాస్తా ముందస్తుగానే స్పందించినా చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు లక్సెట్టిపేట మినహా అన్ని మున్సిపాలిటీల్లో ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కానీ ఏ మున్సిపాలిటీలోనూ పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయించడం లేదు.

**నాలుగంచెల నివారణ చర్యలేవి?**

దోమలను తుద ముట్టించడానికి నాలుగంచెల పద్ధతుల్లో నివారణ చర్యలు చేపట్టాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు అలా చేయడంలేదు. చెన్నూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో తప్ప మరే మున్సిపాలిటీల్లోనూ ఆ తీరుగా చర్యలు తీసుకోవడం లేదు. కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, హైడ్రోక్లోరైడ్ పిచికారీ చేయించడం, మురుగునీటి గుంతలు, కాలువల్లో ఆయిల్ బాల్స్ వదలడం, ఇళ్ల మధ్యన, వీధుల్లో, రహదారుల వెంట ఫాగింగ్ చేయాల్సి ఉండగా ప్రధాన మున్సిపాలిటీల్లో కేవలం ఫాగింగ్ చేయించడంతోనే సరిపెడుతున్నారు. దీంతో జ్వరాలను వ్యాప్తి చేసేందుకు అనువైన పరిస్థితులను మున్సిపల్ అధికారులే కల్పిస్తున్నారని పురప్రజలు విమర్శిస్తున్నారు. చిత్తశుద్ధితో వ్యవహరించి దోమల నియంత్రణ చర్యలు సక్రమంగా చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**దోమల నివారణకు చర్యలు**



దోమల నివారణ లక్ష్యంగా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట ఫాగింగ్ చేయిస్తున్నాం. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. హైడ్రో క్లోరైడ్‌ను పిచికారీ చేయిస్తున్నాం. పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేయిస్తున్నాం. దోమల నివారణ చర్యలు ముమ్మరం చేశాం.

– కె.సమ్మయ్య, కమిషనర్, బెల్లంపల్లి

## ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్‌గా నాగేంద్రప్రసాద్


నియామకపత్రం అందుకుంటున్న నాగేంద్ర

పాతమంచిర్యాల: ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన నల్ల నాగేంద్రప్రసాద్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కన్వీనర్ డిడ్డి సుధాకర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బుర్ర రాము, పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ మాలెం మధు, హైదరాబాద్ పార్లమెంటు కన్వీనర్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ, కేంద్ర మంత్రులను కలిసిన తపస్ నేతలు


రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తపస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసి వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఏకీకృత సర్వీస్ నిబంధనలు అమలుకు ఎదురవుతున్న రాజ్యాంగ, న్యాయపరమైన చిక్కులు తొలగించాలని, అర్హులైన ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించాలని, జాతీయ నూతన విద్యావిధానం అమలు చేయాలని తొమ్మిది మంది ప్రతినిధి బృందం సభ్యులు వారిని కలిసినట్లు ఆయన పేర్కొన్నారు.

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: కట్టుకున్న భార్యను నమ్మించి హత్యచేసిన కేసులో భర్తతో పాటు మరో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.12 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేశ్ గురువారం తీర్పు చెప్పారు. అదనపు పీపీ జీవీఎస్ ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జైనూర్ మండలం బూసిమెట్టకు చెందిన యువతి సాగర్, అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మర్సోకోల మాధవ్‌రావు మూడేళ్ల పాటు ప్రేమించుకున్నారు. అప్పటికే వివాహమైన మాధవరావు సాగర్‌తో పెళ్లికి నిరాకరించాడు. ఈక్రమంలో కుటుంబసభ్యులు కుల పంచాయతీ నిర్వహించగా ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఫిబ్రవరి 19, 2019న వివాహం జరిగింది. ఈ క్రమంలో మాధవరావు, సోదరుడు దత్తు, స్నేహితుడు దుర్వా నాగుతో కలిసి పథకం ప్రకారం మార్చి 30, 2019న గ్రామ శివారులోకి తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని గుట్టవద్దకు తీసుకెళ్లి కాల్చివేశారు. మృతురాలి తల్లి ఆత్రం దృపదాబాయి ఫిర్యాదు మేరకు జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. సీఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేశారు. మృతదేహం దహనం చేసిన స్థలంలో లభించిన రెండు ఎముకలకు డీఎన్‌ఏ పరీక్ష నిర్వహించగా సాగర్ శవంగా నిర్ధారించారు. అడిషనల్ పీపీ ప్రసాద్ 17 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పినట్లు అదనపు పీపీ వివరించారు.

## బొగ్గు ఉత్పత్తికి అన్నిచర్యలు చేపట్టాలి

- సింగరేణి సీఎండీ శ్రీధర్
- జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్


వీసీలో మాట్లాడుతున్న సీఎండీ శ్రీధర్

నస్పూర్: వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త ప్రాజెక్టుల నుండి 200 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నాటికి సింగరేణిలో నాలుగు కొత్త ఓపెన్ కాస్టులు ప్రారంభించాలని సూచించారు. నైనీ(ఒడిశా), వీకే కోల్‌మైన్ (కొత్తగూడెం), రోంపెడ్ ఓపెన్‌కాస్ట్ (ఇల్లెందు), గోలేటి ఓపెన్ కాస్ట్ (బెల్లంపల్లి)లకు సంబంధించిన అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు అన్ని అనుమతులు లభించిన నేపథ్యంలో అక్కడ నిర్మించాల్సిన రైల్వే సైడింగ్, తదితర పనులపై త్వరలోనే సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్స్ మేనేజర్ స్వప్న, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

నస్పూర్: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఆర్‌పీ 1 గనిపై 'అలాయ్ బలాయ్' నిర్వహించారు. కార్మికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ షిఫ్ట్ డిస్ట్రిబ్యూషన్‌లో అవకతవకలు ఉన్నాయని, వాటిని గుర్తించి యాక్టింగ్ కార్మికులకు అదే పని ఇవ్వాలన్నారు. మైన్‌కు కావాల్సిన ఇటుకలు రాకపోవడంతో వెంటిలేషన్ గోడలు నిర్మించక గాలి సరఫరా కావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, ఎస్ఆర్‌పీ 1 పిట్ సెక్రటరీ ఎంబడి తిరుపతి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ అయిద తిరుపతిరావు, నాయకులు రామిడి మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, మల్లారెడ్డి, రాజేశం, శ్రీధర్, వికాశ్, బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

పాతమంచిర్యాల: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గురువారం కలెక్టర్, బీసీ వెల్ఫేర్ అధికారి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 10 నెలలుగా జీతాలులేక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వమే నేరుగా వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ నెల వరకు జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరించి సమ్మెలోకి దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మెహర్ బాబా, శ్రీవిద్య, నర్సింహులు, పద్మ, సత్యం, వసంత, కళ, రాజయ్య, స్వప్న పాల్గొన్నారు.

## శ్రేష్ఠ ఎంపిక పరీక్షలో సీవోఈ విద్యార్థి ప్రతిభ


అభివాస్‌ను అభినందిస్తున్న సత్యనారాయణ

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్కీం ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్‌హయ్యర్ క్లాసెస్ ఇన్ టార్గెటెడ్ ఏరియా (శ్రేష్ఠ) ఎంపిక పరీక్షలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (సీవోఈ) విద్యార్థి మనుగు అభివాస్ ప్రతిభ కనబర్చాడు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో ప్రవేశపరీక్ష నిర్వహించింది. ఇందులో ప్రతిభ చాటిన మూడువేల మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో అభివాస్ ఒకరని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సైదులు ప్రకటించారు. గురువారం గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సత్యనారాయణ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సైదులు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు అత్యున్నతమైన ప్రైవేట్ పాఠశాలలో ప్రవేశం కల్పిస్తారన్నారు. ఇందుకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈ పరంజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామారావు, దత్తప్రసాద్, విద్యార్థి తండ్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి


రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

లక్సెట్టిపేట: ఇటీవల వర్షాలు కురుస్తున్నందు వల్ల గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు, దౌడపల్లి, రంగపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందువల్ల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలను వాడాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో ప్రసాద్, ఏపీవో వెంకటరమణ, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## కార్మిక కాలనీలకు కలుషిత నీటి సరఫరా


సరఫరా అవుతున్న రంగుమారిన తాగునీరు

బెల్లంపల్లి: పట్టణంలోని కార్మిక కాలనీలకు గురువారం కలుషితమైన తాగునీరు సరఫరా అయ్యింది. బూడిదగడ్డ బస్తీలో సింగరేణి నల్లాలకు మట్టితో నిండిన తాగునీరు సరఫరా కావడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర విస్మయానికి గురయ్యాయి. ఫిల్టర్ బెడ్‌లో శుద్ధిచేసిన నీటిని అందించాల్సి ఉండగా మురికి నీటిని సరఫరా చేయడం ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా

జైపూర్: ఇంట్లో సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చనని టీఎస్ రెడికో మేనేజర్ నివత్రి తెలిపారు. జైపూర్ మండలం కాన్కూర్ గ్రామాన్ని సెర్ప్, టీఎస్ రెడికో సోలార్ కంపెనీ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గురువారం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునీత, ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ వెంకటేశ్వరగౌడ్, ఏపీఎం రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయాలి

జన్నారం: గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్వయంగా గల్ఫ్ బోర్డు గురించి హామీ ఇచ్చి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. చివరి అసెంబ్లీ సమావేశాల్లోనైనా గల్ఫ్ బోర్డుపై ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, నాయకులు ఎల్లయ్య, మహేశ్‌గౌడ్, రాజలింగు పాల్గొన్నారు.

### క్రైమ్ రివ్యూ సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఏసీపీ పంతాటి సదయ్య హాజరై డివిజన్‌లో క్రైమ్ తీరు తెన్నులు, నేర పరిశోధన, తదితర అంశాల గురించి అధికారులతో చర్చించారు. బెల్లంపల్లి రూరల్, వన్‌టౌన్, మందమర్రి, తాండూర్ సీఐలు ఎస్.రాజ్‌కుమార్ గౌడ్, టీ.శంకరయ్య, మహేందర్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, 12 మంది ఎస్సైలు హాజరయ్యారు. అంతకు ముందు తాళ్ల గురిజాల పోలీసు స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కలు నాటారు.

### నాణ్యమైన విద్యనందించాలి

తాండూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సూచించారు. గురువారం మండలంలోని తంగళ్లపల్లి మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ తరగతికి సంబంధించిన భాష, గణితం, ఆంగ్లంలో విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎంఈవో ప్రభాకర్, నోడల్ అధికారి సత్యనారాయణ, జిల్లా పరిశీలకుడు విద్యాసాగర్ పాల్గొన్నారు.